క్లుప్తంగా

మార్మోగిన హరేకృష్ణ మహామంత్ర నాద సంకీర్తన



శివాజీ పార్కులో మహామంత్ర నాద సంకీర్తన చేస్తున్న భక్తులు

ఎంవీపీకాలనీ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో హరేకృష్ణ మహామంత్ర నాద సంకీర్తన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శివాజీ పార్కుతోపాటు నగరంలోని 20 ప్రాంతాలకు పైగా ఈ కార్యక్రమం జరిగింది. 200 మంది భక్తుల వరకు పాల్గొని నాద సంకీర్తన చేశారు. విశ్వశాంతి, శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం సాయంత్రం ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

కాలువలు, రహదారుల మరమ్మతులకు శంకుస్థాపన



మద్దిలపాలెంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో కాలువలు, రోడ్ల మరమ్మతులకు శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ గుడ్ల విజయసాయితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జోన్-3 కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ రూ.49 లక్షల జీవీఎంసీ నిధులతో కాలువలు, రోడ్ల మరమ్మతులతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

అపరిశుభ్రంగా బాలల ప్రాంగణం



వీఎంఆర్‌డీఏ పార్కులో అధ్వానంగా దర్శనమిస్తున్న బాలల ప్రాంగణం

ఏయూక్యాంపస్: బాలల ఆట ప్రాంగణం అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. వీఎంఆర్‌డీఏ పార్కులో చిన్నారుల ప్రాంగణం అధ్వానంగా మారింది. చిన్నారులు ఎంతో ఇష్టంగా వచ్చే ఈ పార్కు పరిసరాలు దుమ్ముధూళితో కనిపిస్తున్నాయి. ఊయలలు ఉండే స్థలం చుట్టూ వేసిన ప్రత్యేకమైన మ్యాట్ పలుచోట్ల దెబ్బతింది. ప్రస్తుతం ఇవి పూర్తిగా పాడైపోయి అస్తవ్యస్తంగా ఉన్నాయి. వీటిని కనీసం శుభ్రం చేయడం కూడా లేదు. దీంతో చిన్నారులను ఇక్కడికి తీసుకెళ్లడానికి కూడా తల్లిదండ్రులు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు బాలల ప్రాంగణాన్ని పరిశుభ్రం చేయించే దిశగా సిబ్బందిని ఆదేశించాల్సిన అవసరం ఉంది. తరచూ ఈ పరిసరాలను సిబ్బంది శుభ్రం చేస్తే చిన్నారులకు ఎంతో ఆహ్లాదాన్ని పంచడం సాధ్యపడుతుంది.

పార్కింగ్ ఇలా.. రాకపోకలెలా..?



పిఠాపురం కాలనీ రహదారిపై పార్క్‌చేసిన వాహనాలు



సర్వీస్ రోడ్డులో నిలిపిన పార్సిల్ సర్వీస్ వాహనాలు

- కాలనీ, సర్వీస్ రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- దృష్టి సారించని ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం: కాలనీల్లో ఖాళీ రోడ్లు కనిపిస్తే చాలు.. ఎక్కడికక్కడ ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో నిలిపిన వాహనాల మాటున రాత్రి వేళ్లలో ఆకతాయిలు, మందుబాబులు చేరి చిందులేస్తున్నారు. దారిన పోయవారితో వాగ్వాదాలకు దిగుతున్నారు. చీకటి పడితే కాలనీ రోడ్ల మీద ఒంటరిగా వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలువురు వాహనచోదులకు నిబంధనలు మీరుతున్నారు.

పిఠాపురం కాలనీలో..

పిఠాపురం కాలనీ కూరగాయల మార్కెట్ నుంచి ఇటు బీజేపీ నేత మాధవ్ ఇంటికి వచ్చే సర్వీస్ రోడ్డు ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయింది. ఈ రహదారిపై కూరగాయల మార్కెట్ చివరి వరకూ వాహనాలు నిలిపి వెళ్లిపోతున్నారు. దీంతో పిఠాపురం కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు.

సర్వీస్ రోడ్డులో తంటాలు

పిఠాపురం కాలనీలోని కూరగాయల మార్కెట్ నుంచి మలేరియా కార్యాలయం వరకూ గల సర్వీస్ రోడ్డులో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ లారీలు, ప్రైవేట్ బస్సులు, ఏటీఎం క్యాష్ ఫిల్లింగ్ వాహనాలు, ఆటోలను ఇష్టానుసారంగా పార్క్‌చేస్తున్నారు. ఇదే రోడ్డులో లక్కీ పార్సిల్ సర్వీస్ కంపెనీకి చెందిన భారీ లారీలను నిలిపి ఉంచుతున్నారు. దీంతో సర్వీస్ రోడ్డుపై రాకపోకలకు స్థానికులు, ఇతర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఇళ్ల ముందు పార్కింగ్ చేయవద్దని ఎన్నిసార్లు చెప్పినా.. వాహనదారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి కాలనీ రహదారులు, సర్వీస్ రోడ్లపై వాహనాల రాంగ్ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

సీపీ చొరవతో ఇంటికి చేరిన నిజామాబాద్ వాసి

- పదేళ్ల తర్వాత కుటుంబ సభ్యుల చెంతకు శ్రీను



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరసింహమూర్తి

ఎంవీపీకాలనీ: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చొరవతో నిజామాబాద్‌కు చెందిన శ్రీను అనే వ్యక్తి సొంతింటికి చేరాడు. శుక్రవారం ఎంవీపీ పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అతడిని అప్పగించారు. పదేళ్లుగా శ్రీను జాడ కోసం పరితపిస్తున్న కుటుంబ సభ్యులు ఆనందంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఈ వివరాలు వెల్లడించారు. ఇటీవల సీపీ బాగ్చి బీచ్ రోడ్డులో ప్రయాణిస్తుండగా లాసన్స్ బే కాలనీలో మతిస్థిమితం లేకుండా, దుస్తులు కూడా సరిగా లేని ఓ వ్యక్తి ఉండటాన్ని గమనించారు. అతడిని సంరక్షించి వివరాలు తెలుసుకోవాలని సూచించడంతో ఆ దిశగా ఎంవీపీ పోలీసులు చర్యలు చేపట్టారు. సీఐ మురళీ సూచనలతో ఆ వ్యక్తిని ముందుగా రెడ్‌క్రాస్ షెల్టర్‌లో చేర్పించారు. షెల్టర్ నిర్వాహకులు అతడిని సంరక్షించి, వివరాలు సేకరించగా.. శ్రీనుది నిజామాబాద్‌గా చెప్పినట్లు వారు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సీఐ మురళీ బృందం అతడి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం వారు నగరానికి చేరుకోగా.. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో శ్రీనును అతడి తమ్ముడు, ఇతర కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీను తమ్ముడు మాట్లాడుతూ తన అన్నను అప్పగించిన విశాఖ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. సీపీ, ఏసీపీతోపాటు ఎంవీపీ పోలీసుల సేవలను అభినందించారు. పదేళ్లుగా వెతుకుతున్నట్లు వెల్లడించిన శ్రీను తమ్ముడు 2016 హైదరాబాద్ చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. సీఐ మురళీ, ఎస్ఐలు ఎం.శ్రీను, ధనుంజయ్‌నాయుడు, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ రైతుబజార్‌లో కమిషనర్ తనిఖీలు



రైతుబజార్‌లో అధికారులకు సూచనలిస్తున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత సందర్శించారు. ఉత్తరాంధ్ర పర్యటన నేపథ్యంలో విశాఖకు వచ్చిన ఆమె శుక్రవారం సాయంత్రం ఎంవీపీ రైతుబజార్‌ను తనిఖీ చేశారు. ఇటు రైతులకు, అటు వినియోగదారులు ఇబ్బందులు లేకుండా ధరలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పలువురు రైతులతో ముచ్చటించారు. రైతుల కార్డులు, డ్వాక్రా కౌంటర్లను పరిశీలించారు. రైతులు తీసుకొస్తున్న టమోటా, డ్వాక్రా రైతులు అమ్ముతున్న ఉల్లిపాయల నాణ్యతను పరిశీలించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు అందిస్తున్నారా లేదా అనే అంశంపై ఆరా తీశారు. ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందులో రైతులను భాగస్వాములను చేయాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ జి.శ్రీనివాస్ కిరణ్, ఏడీ యాసిన్, ఈవో వరహాలు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి జయంతి



పూజలు జరిపిస్తున్న అర్చకులు



లక్ష్మీ పూజలు చేస్తున్న మహిళలు

ఏయూక్యాంపస్: ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం బీచ్ రోడ్డులోని ప్రసన్న రుక్మిణి సమేత పాండురంగ స్వామి దేవాలయంలో శ్రీ వాసవి స్నేహాలయం కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మంగళధ్వనులతో, వేద మంత్రాల నడుమ మహాలక్ష్మి అమ్మవారి జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, తిరుమంజన సేవ, సహస్ర నామాలతో అర్చన చేశారు. కుంకుమార్చన, మంత్రపుష్పాలు, మంగళహారతి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి జయంతిలో 108 మంది మహిళలు పాల్గొని పూజించారు. ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ మట్టపల్లి సీత, కో చైర్ పర్సన్ కేతవరపు ఉమ, కన్వీనర్ సి.వి.ఎస్.విశాలాక్షిల నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, ఎం.హనుమంతరావు, ఆలయ ఈవో దేవుళ్లు తదితరులు పాల్గొన్నారు.

వీఎల్‌వో క్యాడర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న ఫెడరేషన్ సభ్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్యాడ్యుయేట్ వెటర్నయిన్స్ ఫెడరేషన్ జోన్-1 కార్యవర్గ సమావేశం శనివారం పశుసంవర్ధక శాఖ సంచాలకుల కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ బి.సేవా నాయక్, ప్రధాన కార్యదర్శి బి.గోవిందరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.విజయ సారధి, కోశాధికారి డి.కోదండ రావు, పాల్గొని సమస్యలపై చర్చించారు. ప్రధానంగా వీఎల్‌వో క్యాడర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలని, పారా వెటర్నరీ కౌన్సిల్ పూర్తిస్థాయిలో ప్రభుత్వం త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఫెడరేషన్ చైర్మన్‌గా డి.కోదండరావును, అనకాపల్లి జిల్లా ఇంచార్జి చైర్మన్‌గా వెంకట లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కో చైర్మన్ వైవీ ప్రసాద రావు, ఎం.రాఘవరావు, ఎం.సాగర్ బాబు, ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కేశవబాబు (ఫైల్)

బీచ్‌రోడ్డు: ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో చెట్టును ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మద్దిలపాలేనికి చెందిన కేశవబాబు(21) అనే యువకుడు గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో మద్దిలపాలెం నుంచి ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్ మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అతివేగంగా నడపడంతో అదుపు తప్పి వాహనంతో చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కేశవబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం యువకుడి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనకాపల్లి నూకాంబికా దేవస్థానం ఈవోగా వెంపలి

మహారాణిపేట: అనకాపల్లిలోని శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సింహాచలం దేవస్థానం ఏఈవో వెంపలి రాంబాబు నియమితులయ్యారు. శ్రీ కనకమహాలక్ష్మి ఆలయంలో ఏఈవోగా పనిచేస్తున్న రాంబాబును ఇటీవల సింహాచలం దేవస్థానం ఏఈవోగా బదిలీ చేశారు. ఆయనకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి లభించడంతో అనకాపల్లి దేవస్థానానికి సహాయ కమిషనర్, ఈవోగా నియమించారు.

హోలీ.. ఆనంద కేళి



ఆనంద మార్గ్ చిల్డ్రన్స్ హోమ్‌లో హోలీ వేడుకల్లో చిన్నారుల కేరింతలు



సాగర తీరంలో యువత హోలీ సందడి



మద్దిలపాలెంలో రంగులు జల్లుకుంటున్న యువత

ఏయూక్యాంపస్: ఆనందాల కేళీ.. రంగుల హోలీ పండగను శుక్రవారం నగరవాసులు జాలీగా జరుపుకున్నారు. వీధుల్లో యువత, చిన్నారులు రంగులు పూసుకుంటూ సందడి చేశారు. సాగర తీరానికి పెద్దెత్తున నగరవాసులు విచ్చేసి హోలీ వేడుకలు జరుపుకుని, సముద్ర స్నానాలు ఆచరించారు.

చిల్డ్రన్స్ హోమ్‌లో ఆనందంగా..

జీవీఎంసీ 10వ వార్డు ఓల్డ్ డైరీ ఫారం వద్ద ఇందిరా నగర్‌లోని ఆనంద మార్గ్ చిల్డ్రన్స్ హోమ్‌లో హోలీ వేడుకలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. చిన్నారులు పరస్పరం రంగులు పూసుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వీధుల్లో యువత సందడి

మద్దిలపాలెం: మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ, పిఠాపురం కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల్లోని ప్రధాన రహదారులపై యువత రంగులు పూసుకుంటూ సందడి చేశారు. యువతీ, యువకులు, చిన్నారులు హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. వీధుల్లో పిల్లలు, పెద్దలు రంగులు జల్లుకుంటూ డీజే శబ్దాల మధ్య డ్యాన్స్‌లు వేశారు. వీధులన్నీ రంగులతో నిండిపోయాయి.

తీరంలో రెయిన్ డ్యాన్స్ గోల..



రెయిన్ డ్యాన్స్ నిర్వాహకులతో మాట్లాడుతున్న పోలీసులు



టికెట్ల కోసం క్యూలో ఉన్న నగరవాసులు

- ఇబ్బందికరంగా డీజే సౌండ్స్

ఏయూక్యాంపస్: నిత్యం ప్రశాంతంగా కనిపించే బీచ్ రోడ్డు శుక్రవారం రణగొణ ధ్వనులతో కనిపించింది. ప్రధానంగా కురుసుర మ్యూజియం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన రెయిన్ డ్యాన్స్ కార్యక్రమం కొంత ఇబ్బందికరంగా మారింది. హోలీ ఉత్సవ్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారీగా డీజే పెట్టారు. రెయిన్ డ్యాన్స్ ఉండటంతో పెద్ద సంఖ్యలో చిన్నాపెద్దా ఇక్కడికి చేరుకున్నారు. దీంతో ఈ శబ్దం విక్టరీ ఎట్ సీ దాటి వినిపించింది. అదే సమయంలో బీచ్ రోడ్డులో వెళ్తున్న వారు ఆసక్తిగా రోడ్డు పక్కనే వాహనాలను నిలిపి వేసి చూశారు. దీంతో కొంత ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకుని నిర్వాహకులతో మాట్లాడి డీజే సౌండ్ తగ్గించాలని కోరారు. కొద్దిసేపు అక్కడే ఉండి డీజే ఆపేయాలని సూచించారు. పోలీసులు ఉన్నంతవరకు నిర్వాహకులు సౌండ్ తగ్గించినప్పటికీ తరువాత యథావిధిగా కొనసాగించారు. దీంతో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పోలీసులు కార్యక్రమాన్ని ఆపేయాలని సూచించడంతో వచ్చినవారు వెనుదిరిగారు. మేడ్ ఈవెంట్స్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రూ.299, రూ.699, రూ.1,299, రూ.2,799 చొప్పున డబ్బులు టికెట్ రూపంలో వసూలు చేశారు. పరిమితికి మించి సౌండ్ ఏర్పాటు చేయడంతో పర్యాటకులకు, స్థానికులకు ఇబ్బందిగా అనిపించింది. అధికారులు అనుమతులిచ్చే సమయంలో కొంత కార్యక్రమ పూర్వపరాలు తెలుసుకుని, స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన అవసరం ఉంది. దీనిపై నిర్వాహకులను సంప్రదించగా సౌండ్ పొల్యూషన్ కారణంగా మధ్యాహ్నం నుంచి కార్యక్రమం నిలిపేసినట్లు తెలిపారు.

మహిళలకు నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు అందుకున్న మహిళలతో కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు లీలాసుందరినగర్‌లో విశాఖ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో భాగంగా సొసైటీలో సభ్యులు సుమారు 150 మంది మహిళలకు బియ్యం, పప్పులు, నూనెలు, కర్జూరం, పలు రకాల పిండిలు తదితర నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సొసైటీలోని సీనియర్ మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ ఎండీ సిస్టర్ నిర్మల మాట్లాడుతూ మహిళలు సమాజంలో గౌరవంగా జీవించాలని ఆకాంక్షించారు. తమ సొసైటీలో వేల సంఖ్యలో మహిళలు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. వారు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో సుమారు రూ.2,000 విలువ చేసే నిత్యావసర సరకులు ఒక్కొక్కరికి అందజేసినట్లు చెప్పారు. అనంతరం హెల్ప్ ఏజ్ ఇండియా ఏపీ కోఆర్డినేటర్ కృష్ణారావు మహిళలకు మొబైల్‌ఫోన్ వినియోగంలో జరుగుతున్న మోసాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

సీఆర్పీల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న సీఆర్పీ నూతన కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్పీ) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీఆర్పీల సమస్యలపై చర్చించి, నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి మాట్లాడుతూ సీఆర్పీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో మండల సీఆర్పీలు శివాజీ, ఈశ్వర రావు, రాంబాబు కీలకంగా వ్యవహరించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా సీఆర్పీలు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాసభలు

అల్లిపురం: మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కిఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన సంయుక్త కార్యదర్శి రవికుమార్ తెలిపారు. జగదాంబ దరి సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం మీడియాకు ఆయన వివరాలు వెల్లడించారు.

అప్పు చేసి కందిపప్పు కూడు



- రేషన్ పంపిణీలో కానరాని కందిపప్పు
- బహిరంగ మార్కెట్‌లో ధరల మోత
- కార్డుదారులు, డీలర్ల గగ్గోలు
- ఇదీ పౌర సరఫరాల శాఖ తీరు

రాష్ట్రంలో ఏ ముహూర్తాన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో గాని రేషన్ డిపోల్లో ఇచ్చే కందిపప్పు కొండెక్కిపోయిందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. వరుసగా మూడో నెల కూడా రేషన్ డిపోల ద్వారా కందిపప్పు ఇవ్వకపోవడం గమనార్హం. కొన్ని నెలలు డిపోకు కేవలం వంద కిలోల కందిపప్పు మాత్రమే రావడం తెలిసిందే. ఈ నెల అది కూడా రాకపోవడంతో ఇటు కార్డుదారులు.. అటు డీలర్లు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బయట మార్కెట్లో కందిపప్పు కొనేందుకు అప్పు చేయాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు – సీతమ్మధార

పౌర సరఫరాల శాఖ సర్కిల్-2లోని తూర్పు, ఉత్తర నియోజకవర్గాల పరిధిలో 152 రేషన్ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో గల 1.53 లక్షల మంది రైస్ కార్డుదారులకు 78 వాహనాల ద్వారా రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే ఇస్తున్నారు. వరుసగా మూడు నెలల పాటు కూడా బియ్యం, పంచదార తప్ప మూడో సరకు ఇస్తే ఒట్టు. ఇక ఈ నెలలో పలు ప్రాంతాల్లో గ్రామదేవతల పండగలు ఉన్నాయి. అయినప్పటికీ బియ్యంతోపాటు పంచదార మాత్రమే ఇవ్వడం గమనార్హం.

డిమాండ్ ఉన్నా.. పంపిణీ సున్నా

సాధారణంగా ఒక్కో డిపో పరిధిలో వెయ్యి వరకు రైస్ కార్డులున్నాయి. ఒక్కో డిపో డీలర్ కందిపప్పు కోసం ఇప్పటికే రూ.2 లక్షల వంతున డీడీలు చెల్లించారు. ఇప్పుడేమో కందిపప్పు రాకపోవడంతో కమీషన్ రాకపోగా.. అప్పులకు వడ్డీ కట్టాల్సి వస్తోందని డీలర్లు మదన పడుతున్నారు. నెలలు గడుస్తున్నా కందిపప్పు పంపిణీ మాత్రం కానరావడం లేదని కార్డుదారులు, రేషన్ డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. కందిపప్పు కిలో బహిరంగ మార్కెట్‌లో రూ.170 ఉండగా.. సూపర్‌బజార్‌లో రూ.140, గృహమిత్ర కౌంటర్లలో రూ.130, రైతు బజార్లలో ప్రభుత్వ సబ్సిడీ కౌంటర్‌లో రూ.120 చొప్పున విక్రయిస్తున్నారు. రేషన్ డిపోలో కిలో కందిపప్పు రూ.67కే ఇవ్వడంతో డిమాండ్ అధికంగా ఉంటుంది. కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తూ రేషన్ వాహనాల వద్ద గంటల తరబడి వేచి ఉండేలా చేస్తున్నారని కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రేషన్ పంపిణీ వాహనం వద్ద సరకుల కోసం వేచి ఉన్న కార్డుదారులు

రేషన్ డిపోలు నిర్వీర్యం

కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ డిపోలను పటిష్టం చేస్తామన్నారు. మూడు నెలలుగా కందిపప్పు పూర్తిగా ఇవ్వడం మానేశారు. రెండు నెలల కిందట పంచదార పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. ఈ నెలలో ఆయా ప్రాంతాల్లో అమ్మవారి జాతరలు ఉన్నాయి. ఒక్కో డిపోకి వంద కిలోల కందిపప్పు కూడా రాకపోవడం అన్యాయమనే చెప్పాలి. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధరలు మండిపోతున్నాయి. రేషన్ డిపోలో కందిపప్పు ధర రూ.67 కావడంతో డిమాండ్ అధికంగా ఉన్నా ప్రభుత్వం వరుసగా మూడో నెల కూడా ఇవ్వకపోవడంతో కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం కందిపప్పు ఇవ్వకపోవడంతో కమీషన్ కోల్పోతున్నామని రేషన్ డీలర్లు వాపోతున్నారు.